

వెలుగుల దేవుడికి వందనం

నేడు రథసప్తమి



● రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, పట్టణంలో ఇళ్లు లేని అక్కచెల్లెమ్మలకు టిడ్కో ప్లాట్లతో కలిపి 30.75 పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వబోతున్నామని సగర్వంగా చెబుతున్నాను.

- 2020 డిసెంబరులో చిత్తూరు జిల్లాలో జరిగిన జగనన్న కాలనీల పట్టాల పంపిణీ సభలో సీఎం జగన్ మాటలు.



ఒట్టి ఆర్భాటం



- జిల్లాలో మంజూరైన జగనన్న గృహాలు కేవలం 40,479
- ఈ ఐదేళ్లలో పూర్తి చేసినవి 16,629 మాత్రమే
- నిధులు కూడా కేంద్ర ప్రభుత్వానివే
- పైసా ఖర్చు పెట్టకుండా ప్రచారం చేసుకుంటున్న వైసీపీ ప్రభుత్వం
- చంద్రబాబు ప్రభుత్వంలో కట్టించిన ఇళ్లు 74,570



కర్నూలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని చేస్తున్న హడావిడి అంతా ఇంత కాదు. కానీ సీఎం జగన్ మాటలు ఆచరణలోకి రావడం లేదు. పేదల సొంతింటి ఆశలు ఎండమావులుగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, పీఎంఏవై-ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకాల కింద జిల్లా పేదలకు 56,586, టిడ్కో కింద మరో 17,896 కలిపి 74,570 ఇళ్లు కట్టించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పేదల ఇండ్ల పథకాన్ని రెండేళ్లు నిర్లక్ష్యం చేశారు. ఆ తరువాత జగనన్న కాలనీల పేరిట ఆర్భాటం మొదలు పెట్టారు. జిల్లాకు 40,479 ఇళ్లు మంజూరు చేస్తే.. వాటిలో పూర్తయినవి కేవలం 16,629 ఇళ్లే. గత టీడీపీ ప్రభుత్వం కట్టించిన ఎన్టీఆర్ ఇళ్లతో పోలిస్తే ఈ ప్రభుత్వం కేవలం 22.29 శాతం జగనన్న ఇళ్లు నిర్మించి పేదలందరికీ ఇళ్లు ఇచ్చినట్లు బిల్డప్ ఇస్తున్నారు. పైగా ఈ ఇళ్ల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో కట్టిన ఇళ్లకు జగన్ ఫొటోలు పెట్టి, వైసీపీ జెండా రంగులు వేసి, అంతా తామే చేశామని హడావుడి చేస్తున్నారు.

జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 'నవరత్నాలు-పేదలు అందరికీ ఇళ్లు' పథకంలో కింద 3030 జగనన్న లే అవుట్లలో 40,479 పక్కా ఇళ్లు మంజూరు చేశారు. 2021లో మెగా గ్రౌండింగ్ మేళా అంటూ హడావుడి చేశారు. మూడేళ్లవుతున్నా గృహ ప్రవేశానికి సిద్ధం చేసిన ఇళ్లు 16,629 మాత్రమే. 7,744 ఇళ్లు పునాదుల్లోనే ఆగిపోయాయి. 10,708 ఇళ్ల పనులు పునాదులు దాటాయి. ఇప్పట్లో ఈ ఇళ్లు పూర్తయ్యే పరిస్థితి కనపడటం లేదు. పైకప్పు వేయడానికి సిద్ధంగా ఉన్నవి 5,358 మాత్రమే. అధికారిక రికార్డులు చెబుతున్న లెక్కలు ఇవి. వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఇళ్ల పేరిట పేదలను దగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్లలో 16,629 ఇళ్లను మాత్రమే పూర్తి చేసి పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు వైసీపీ పెద్దలు, ఎమ్మెల్యేలు హడావుడి చేస్తున్నారు.



చంద్రబాబు ప్రభుత్వంలో 74,570 ఇళ్లు

రాష్ట్ర విభజన తరువాత 2014లో కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. ఎలాంటి హడావుడి, ఆర్భాటం లేకుండా ఐదేళ్లలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ స్కీమ్, పీఎంఏవై-ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,16,693 ఇళ్లను మంజూరు చేశారు. 2017 అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ఫేస్-1 కింద 5,940 ఇళ్లు, 2018 జూలై 5న ఫేస్-2 కింద 24,402 ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేశారు. ఫేస్-3 కింద 28,860, ఫేజ్-4 కింద 57,491 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు అప్పగించారు. ఏపీ గృహ నిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్న లెక్కలు ఇవి. ఒక్క కర్నూలు జిల్లాలోనే 56,586 ఇళ్లు పూర్తి చేశారు. పేదలకు ఇళ్ల నిర్మాణ వ్యయం భారం కాకూడదని యూనిట్ విలువను కూడా పెంచారు.

పేదలకు టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పూర్తి చేసి ఇచ్చిన పక్కా ఇళ్లు

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ
ఆదోని	5,389	1,316
ఆలూరు	5,845	1,976
మంత్రాలయం	8,727	3,177
పత్తికొండ	9,595	3,265
ఎమ్మిగనూరు	7,388	2,200
కోడుమూరు	8,743	1,231
పాణ్యం	6,746	1,503
కర్నూలు	4,153	1,961
మొత్తం	56,586	16,629
ఏపీ టిడ్కో ఇళ్లు:		
కర్నూలు	10,000	--
ఆదోని	4,720	--
ఎమ్మిగనూరు	3,264	--
మొత్తం	27,894	--
మొత్తం	74,570	16,629

కేంద్రం నిధులు.. జగన్ ఫొటోలు

జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయం రూ.1.80 లక్షలు. ఇవి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులే. పొదుపు మహిళలకు రూ.35 వేలు బ్యాంకు రుణం ఇస్తారు. ప్రభుత్వ కొలతల ప్రకారం కట్టాలంటే రూ.7.5-10 లక్షలు ఖర్చు అవుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. అంటే.. ఒక్క పైసా కూడా వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయడం లేదు. కేంద్ర నిధులు, అప్పులతో పేదలు ఇల్లు కట్టుకుంటే.. జగన్ ఫొటోలు, వైసీపీ జెండా రంగులు వేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

టిడ్కో కింద మరో 27,894 ఇళ్లు

కర్నూలు నగరం, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో పీఎంఏవై-ఎన్టీఆర్ హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ఫేజ్-1 కింద ఏపీ టిడ్కో ఇళ్లు 27,984 మంజూరు చేశారు. అపార్టుమెంట్ తరహాలో అత్యాధునిక షేర్‌వాల్ టెక్నాలజీతో వీటిని నిర్మించారు. చంద్రబాబు ప్రభుత్వంలోనే 23,670 ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేశారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో ఒక్కటే 15,670 టిడ్కో ఇళ్లు నివాసాలకు అనుకూలంగా నిర్మించారు. అయితే.. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటై సీఎం జగన్ బాధ్యతలు చేపట్టాక టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. ఐదేళ్లు అయినా ఒక్క ఇల్లు కూడా పేదలకు ఇవ్వలేదు. చంద్రబాబు ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లతో కలిపి వివిధ పథకాలు కింద 74,570 ఇళ్లు కట్టించి పేదలతో గృహ ప్రవేశాలు చేస్తే... జగన్ వచ్చాక ఐదేళ్లలో పూర్తి చేసిన కేవలం 16,629 ఇళ్లే. మరో 5,358 ఇళ్లు పైకప్పు దశలో ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం కట్టించిన పేదల ఇళ్లతో పోలిస్తే జగన్ ప్రభుత్వం కట్టించిన ఇళ్లు కేవలం 22.29 శాతమే. దీనికే ఇంతా అర్భాటమా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆత్మకూరు, ఫిబ్రవరి 15: సృష్టిలో కనిపించే ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు. హైందవ ఆచార వ్యవహారాల్లో దినకరుడికి ప్రత్యేక స్థానం ఉంటుంది. సృష్టిలో జీవరాశులు సుభిక్షంగా ఉన్నాయంటే అందుకు కారణం సూర్యుడు. నిత్య జీవితంలో సూర్యోదయానికి విశేష ప్రాముఖ్యత ఉంది. అందుకే సూర్య జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. మాఘమాసంలో శుక్ల పక్షం సప్తమి తిథి నాడు ఈ పర్వదినం వస్తుంది. అందుకే సూర్యజయంతిని రథసప్తమి అని కూడా అంటారు. సూర్యుడు ఏడు గుర్రాల రథంపై దక్షిణాయనం ముగించి పూర్వోత్తర దిశగా ప్రయాణం సాగిస్తారని పురాణాలు చెబుతున్నాయి. అది రథసప్తమి రోజు నుంచే ప్రారంభమవుతుంది. మాఘసప్తమి నుంచి రాబోయే ఆరు మాసాలు ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు. మేషం నుంచి మీనం వరకు ఉన్న ద్వాదశ రాశుల్లో (12రాశులు) సూర్యుడు ప్రయాణిస్తాడు. ఈ 12 రాశులను పూర్తి చేయడానికి సూర్య రథానికి ఏడాది సమయం పడుతుంది. సూర్య జయంతి అంటే సూర్యుడు పుట్టిన రోజు కాదు. రథాన్నెక్కి సూర్యుడు సాగించే ప్రయాణం ఈ రోజు నుంచి మొదలవుతుంది. రథసప్తమి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

ఏడు గుర్రాలు ఎందుకంటే...

సూర్య భగవానుడు ఏడు గుర్రాల రథంపై దర్శనమిస్తారు. ఆ ఏడు గుర్రాలు ఏడు వారాలకు సంకేతాలు. ఈ ఏడు గుర్రాలను వేదఛందస్సులు అని కూడా అంటారు. గాయత్రి, త్రిష్టుప్, జగతి అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ అనే ఏడు గుర్రాల రథంపై భానుడు స్వారీ చేస్తాడు. మేషం నుంచి మీనం వరకు ఉన్న పన్నెండు రాశుల్లో ప్రయాణిస్తాడు. ఇలా ఆయన పన్నెడు రాశుల్లో సంచరిస్తూ.. జీవకోటికి శుభ ఫలితాలను కలిగిస్తాడు.

కోడుమూరు పట్టుచీరెకు జాతీయ గుర్తింపు

త్వరలోనే ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండింగ్ పేరుతో మార్కెటింగ్ : చేనేత, జౌళి శాఖ ఏడీ హరికృష్ణ

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 15: కోడుమూరు కేంద్రంగా తయారవుతున్న పట్టుచీరలకు జాతీయ స్థాయిలో రజిత పథకంతో పాటు జ్ఞాపిక ప్రశంసాపత్రం లభించిందని చేనేత, జౌళి శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ఏడీ హరిక్రిష్ణ తెలిపారు. త్వరలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో తయారయ్యే చేనేత వస్త్రాలను ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ల పేరుతో మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని ఆయన గురువారం తెలిపారు. ఇప్పటికే ఈ వస్త్రాల అమ్మకానికి సంబంధించి బ్రాండింగ్‌కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని, కర్నూలు జిల్లాలో 3, నంద్యాల జిల్లాలో 4 చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాలకు బ్రాండింగ్ గుర్తింపు లభించడం వల్ల మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరగనుందని అన్నారు. కోడుమూరులో తయారవుతున్న పట్టుచీరలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించడం వల్ల ఆదోని, ఎమ్మిగనూరు, క్రిష్ణగిరి, ప్యాపిలి, నందవరం, కోవెలకుంట్ల, కల్లూరు తదితర మండలాల్లో చేనేత మగ్గాలపై తయారయ్యే పట్టుచీరలకు విలువ, గిరాకి పెరిగిందని ఆయన తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,200 మంది చేనేత పట్టు చీరలు తయారు చేస్తున్నారని ఏడీ హరిక్రిష్ణ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 15,650 మగ్గాలు ఉన్నాయని, చేనేత వస్త్రాలు తయారు చేసే కార్మికులకు అండగా నిలబడేందుకు పలు పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాట తప్పి మడమ తిప్పారు..

కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ముందు నిరసన తెలియజేస్తున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: సీఎం జగన్ మాట తప్పి మడమ తిప్పారని ఏపీ జేఏసీ నాయకులు అన్నారు. గురువారం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరుతూ భోజన విరామ సమయంలో ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎంపీలు అన్ని బెనిఫిట్స్ పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి రావాల్సిన బకాయిలను మాత్రం ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ నేటి వరకు ఉద్యోగ సంఘాలకు చర్చలకు పిలిచిన దాఖలాలే లేవని అన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులను మోసం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఉద్యోగులపై జరుగుతున్న భౌతిక దాడులకు ప్రభుత్వం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 27న లక్ష మందితో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎంపీ కాశన్న, ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం అధ్యక్షులు కే.రవిప్రకాష్ రావు, ఏపీ టైపిస్టు, స్టెనోగ్రాఫర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్ నాయక్, ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్షులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

జగన్ రాకతో జనానికి అవస్థలు!

● ఎమ్మెల్యే ఎర్రకోట మనవడి పెళ్లికి హాజరు ● సీఎం వెళ్లే వరకు ప్రయాణికులకు ఇబ్బందులు

కర్నూలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ రాకతో జనాలు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయన తిరిగి వెళ్లే వరకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. కర్నూలు-కోడుమూరు ప్రధాన రహదారిలో ఉన్న కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్ హాలులో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనవడు, వైసీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, నిరుపమరెడ్డి దంపతుల తనయుడు పవన్ కళ్యాణ్‌రెడ్డి వివాహం నిర్వహించారు. 11.44 గంటలకు పెళ్లి మండపానికి చేరుకున్న జగన్.. ఎమ్మెల్యే ఎర్రకోటతో కలిసి నూతన వధూవరులు పవన్ కళ్యాణ్‌రెడ్డి, కీర్తనరెడ్డిలను ఆశీర్వదించారు. వారితో ఫొటోలు దిగారు. 12.07 గంటలకు హెలిప్యాడ్ చేరుకొని 12.20 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్నారు. 12.30 గంటలకు గన్నవరం బయలుదేరి వెళ్లారు. అయితే ముఖ్యమంత్రి జగన్ పెళ్లి మండపంలో గడిపిన సమయం 15 నిమిషాలైతే ప్రజలు, ప్రయాణికులకు మాత్రం గంటల కొద్ది అవస్థలు తప్పలేదు. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, ఆదోని, పత్తికొండ, బళ్లారి వైపు వెళ్లే వాహనాలు, అటు వైపు నుంచి కర్నూలు వచ్చే వాహనాలు ఉల్చాల రోడ్డుకు మళ్లించారు. సింగిల్ రోడ్డు కావడం సీఎం వెళ్లేంత వరకు ఆపేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



కోడుమూరు- కర్నూలు రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు



కోడుమూరు ప్రధాన రహదారిని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ఆత్మీయ సమ్మేళనంలో సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటాయని సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సీపీఐ అధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ భవనంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పి. రామచంద్రయ్య అధ్యక్షతన సురవరం సుధాకర్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థి యువజనులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సురవరం సుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు అందరినీ అలరించాయి. సుధాకరరెడ్డికి కర్నూలు ఉమ్మడి జిల్లాతో అనుబంధం ఉందని, ఇక్కడి ప్రాజెక్టు నిర్మాణాల కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీని మోసం చేసిందన్నారు. టీడీపీ-జనసేన ఇద్దరూ ఒక్కటే అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు ఉద్యమాలు చేస్తూనే ఉంటారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ కాకుండా ప్రత్యామ్నాయం రావాలని ఆయన అన్నారు. అదాని, అంబానీ లాంటి వారి చేతుల్లో 70 శాతం సంపద ఉందన్నారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్, బీజేపీలే ప్రధానకారణమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ జాతీయ నాయకురాలు విజయలక్ష్మి, రాయలసీమ విద్యావంతుల ఐక్య వేదిక కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే రామాంజనేయులు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్కూరు చంద్రశేఖర్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి. గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం

ముస్తాబైన శ్రీశైలం మల్లన్న ఆలయం ● ఆగమ శాస్త్రానుసారం నిర్వహణ


ఆలయ ప్రధానగోపురంపై ఏర్పాట్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 15: భూ మండలానికి నాభి స్థానమైన శ్రీశైలం మహా క్షేత్రంలో రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం ఈ నెల 16 నుంచి 21 వరకు మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహా కుంభాభిషేకం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే మహాకుంభాభిషేకం కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పీఠాధిపతులు అధికారులను ఆహ్వానించారు. ఆలయాల్లో జరిగే అత్యద్భుత కార్యక్రమమే మహాకుంభాభిషేకం. ఈ మహోత్సవాన్ని దేవస్థానం ఆగమ శాస్త్రాను సారం జరిపించనుంది. కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఆలయంలో పునర్నిర్మించిన ప్రధానాలయంలోని శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, పునరుద్ధరించిన ఆలయ ప్రాంగణంలోని కొన్ని ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను చేయనున్నారు. మహా కుంభాభిషేక ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో విధి విధానంగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి జప పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపి ఆ మంత్ర పూజిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలు,



గోపురాలను, దేవతామూర్తులను అభిషేకించనున్నారు. ఇప్పటికే మహోత్సవ వేడుకకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మహా కుంభాభిషేకాన్ని పుస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రతి రోజూ విశేష పూజలు, దేవతాహవనాలు, జపాలు, పారాయణాలు జరపనున్నారు. కార్యక్రమంలో మొదటి రోజు ఉదయం సకల దోషాలను హరింపజేసే గోపూజ, గణపతి పూజ, రుత్విగ్వరణం, దీక్షాధారణ, పర్యగ్నికరణం, యాగ శాల ప్రవేశం, పుణ్యాహవచనం, మండపారాధనలు, మూల మంత్రానుష్ఠానాలు, పారాయణాలు, అఖండ దీపస్థాపనలు, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిమంథనం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం, వేదస్వస్తి, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు జరిగే ఈ మహా కుంభాభిషేకంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రబద్ధంగా జరిపించనున్నారు. కార్యక్రమంలో చివరి రోజు ఉదయం శాంతి హోమం, పౌష్టిక హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం పునరుద్ధరించిన ఆలయాలలో యంత్రప్రతిష్ఠలు, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలతోపాటు ఆలయంలో పునర్నిర్మిం చిన శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ జరిపి మహా కుంభాభిషేకం సంబంధిత ప్రత్యేక పూజాధికాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉభయ దేవాలయాల గర్భాలయ విమానాలు, గోపురాలకు, మూలమూర్తులు, ఇతర దేవతామూర్తులకు మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని జరపనున్నారు. అనంతరం అవభృథం, జగద్గురువులకు గురువందనం, మహాదాశీర్వచనం, వేదసభ నిర్వహించనున్నారు.

● ఈ మహాకుంభాభిషేకం సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు నెల్లూరు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు స్వర్ణ రథాన్ని సమర్పించనున్నారు. అనంతరం స్వర్ణ రథానికి సంప్రోక్షణ, ప్రారంభోత్సవ పూజాదికాలు నిర్వహించి అనంతరం స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొననున్నారు.

మల్లన్నకు బంగారు రథం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న స్వర్ణరథం

శ్రీశైలం, ఫిబ్రవరి 15: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు నెల్లూరు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శుక్రవారం స్వర్ణరథాన్ని అందజేయనున్నారు. సమర్పణ అనంతరం స్వర్ణరథానికి సంప్రోక్షణ, ప్రారంభోత్సవ పూజాధికాలు నిర్వహించి అనంతరం ప్రధానాలయం ఎదురుగా ఉన్న రథశాల నుంచి నందిగుడి వరకు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. ఈ స్వర్ణరథ సమర్పణ కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారు. ఈ బంగారు రథం విలువ 11 కోట్ల ఉంటుందని సమాచారం. 23.6 అడుగుల ఎత్తుతో తయారు చేసిన స్వర్ణరథం మధ్యలో పార్వతీ పరమేశ్వరులు, గణపతి, కుమారస్వామి మూర్తులు, దిగువ భాగంలో బ్రహ్మమూర్తులు కొలువై ఉన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

13 కేసులు నమోదు


బియ్యం ప్యాకెట్‌ను తూకం వేస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి జనవరి 15: నగరంలోని ఎల్‌పీజీ గోడౌన్లు, రైస్‌మిల్లులు, షాపింగ్ మాల్స్‌లలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రాంతాలలో తనిఖీలు చేసి బియ్యం సంచిలో తూకం తక్కువగా ఉండటం, షాపింగ్ మాల్స్‌లో ప్యాకేజీ నిబంధనలు ఉల్లంఘనలు మొదలైన వాటి కింద 13 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు, బియ్యం ప్యాకెట్లలతో తూకం తక్కువగా ఉంటే సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ ప్రత్యేక దాడుల్లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్లు, ఇన్‌స్పెక్టర్లు శ్రీరాముడు, పరమేశ్వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో ఏసీబీ జడ్జి దంపతుల పూజలు


ఏసీబీ జడ్జి సత్యవాణి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న వేద పండితులు

మహానంది,ఫిబ్రవరి 15: మహానంది క్షేత్రంలో గురువారం ఏసీబీ జడ్జి సత్యవాణి, శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వాద మంటపంలో వేదపండితులు వీరిని శాల్వతో సన్మానించి, ప్రసాదాలు అందచేసారు. వీరి వెంట ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పీఠాధిపతిని కలిసిన ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు


నారాయణమూర్తి, సుధ దంపతులు, బ్రిటన్ దేశ ప్రధానమంత్రి సతీమణి అక్షక సునక్‌లను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 15: మంత్రాలయం రాఘవేంద్రస్వామి పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులను బెంగళూరు జయనగర్ మఠం బ్రాంచిలో ఇన్ఫోసిస్ అధినేత సుధ, నారాయణమూర్తి దంపతులు, వారి కూతురు అక్షకసునక్‌లు కలిశారు. గురువారం ధార్మిక పర్యటనలో భాగంగా బెంగళూరు వెళ్లిన పీఠాధిపతిని కలిసి అక్కడ రాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారితోపాటు వారి పిల్లలతో పీఠాధిపతి ముచ్చటించారు. భారతదేశ సంప్రదాయాలు, సంస్కృతి, రాఘవేంద్ర స్వామి విశిష్టత గురించి బ్రిటన్ ప్రధానమంత్రి రుషి సునక్ సతీమణి అక్షక సునక్ వారి పిల్లలకు ఆంగ్లంలో పీఠాధిపతి వివరించారు. కార్యక్రమంలో జయనగర్ మఠం మేనేజర్ రాజాఎస్ వాదేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

బాలుడిపై హత్యాయత్నం

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 15: అప్పు రాబట్టుకునేందుకు బాలుడిపై హత్యాయత్నం చేసిన ఘటన ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా.. ఆళ్లగడ్డ పట్టణంలోని బొరుగుల బట్టి వీధిలో నివాసం ఉంటున్న వెంకటలక్ష్మి అదే వీధిలో నివాసం ఉంటున్న భూపాల్‌కు రూ.15 లక్షలు అప్పు ఇచ్చింది. అప్పునకు సంబంధించిన వడ్డీ సక్రమంగా చెల్లించకపోవడంతో ఇంటిని అమ్మి మొత్తం తీర్చాలని ఒత్తిడి చేసింది. ఇళ్లు అమ్మితే తన కుమారుడు చక్రికి అన్యాయం చేసిన వాడిని అవుతానని భూపాల్ అందుకు ఒప్పుకోలేదు. తన అప్పు రావడానికి బాలుడు చక్రి అడ్డుగా ఉన్నాడని భావించిన వెంకటలక్ష్మి ఎలాగైనా అంతం చేయాలనుకుంది. బాలుడు చక్రికి మాయమాటలు చెప్పి అద్దెకు తీసుకున్న కారులో ఎక్కించుకుంది. మైదుకూరు పరిధిలోని వనిపెంట ప్రాంతంలోని అడవిలోకి తీసుకెళ్లింది. చక్రిని కార్లో నుంచి కిందికి దించి కొట్టి కొండపై నుంచి కిందికి తోసేసింది. దీంతో తీవ్ర గాయాల పాలైన చక్రిని అటుగా వెళ్తున్న బస్సు ప్రయాణికులు గమనించి మైదుకూరు పోలీసులకు సమాచారం అందించారు. మైదుకూరు పోలీసులు బాలుడిని విచారించి ఆళ్లగడ్డ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సహాయంతో చక్రి తండ్రి భూపాల్ తన కుమారుడిని మైదుకూరు వైద్యశాలలో చేర్పించారు. ఈ సంఘటనకు కారణమైన వెంకటలక్ష్మిని ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. బాలుడి తండ్రి భూపాల్ పిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీట మునిగిన వేరుశనగ రైతు

- ● రోజురోజుకూ పడిపోతున్న ధర
- ● అమ్మబోతే అడవిగా మారిన మార్కెట్


కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ కాయలు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 15: కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ కాయల ధర రోజురోజుకూ పతనం అవుతోంది. అనేక కష్టనష్టాలకు ఓర్చి వేరుశనగ సాగు చేసిన రైతులకు కన్నీరు తప్ప దక్కిదేమీ లేదు. అమ్మబోతే అడవిగా మారిన మార్కెట్ మాయాజాలాన్ని ఎట్లా తట్టుకోవాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. గురువారం కర్నూలు మార్కెట్‌యార్డులో క్వింటం వేరుశనగ కాయల గరిష్ఠ ధర రూ.6,799కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.5,889, కనిష్ఠ ధర రూ.4,715కు తగ్గిపోవడంతో రైతులు తమకు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా మిగిలే పరిస్థితి లేదని అంటున్నారు. ఇట్లా అయితే సాగు కోసం చేసిన అప్పులు ఎటా తీర్చాలో దిక్కు తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల ప్రారంభంలో క్వింటం రూ.8వేలకు పైబడి ధర ఉంటే.. వారం రోజులుగా రూ.7వేల నుంచి రూ.6,500కు ధర పడిపోయింది. కనిష్ఠ ధర మరింతగా తగ్గిపోయి, తమ పరిస్థితి దారుణంగా ఉందని అంటున్నారు. విత్తనాలు వేసే సమయంలో వ్యాపారుల వద్ద క్వింటం వేరుశనగ కాయలను సుమారు రూ.13వేల నుంచి రూ.16వేల వరకు కొనుగోలు చేశామని, పంట చేతికందిన తర్వాత తాము అమ్మబోతే అందులో సగం ధర కూడా వ్యాపారులు ఇవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు. తాము సంవత్సరమంతా కష్టపడితే.. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల నుంచి పంటను కాపాడుకుంటే తమకు దక్కిన ప్రతిఫలం ఇదా? అని ప్రశ్నిస్తున్నారు. తెగుళ్ల వల్ల ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 3 క్వింటాళ్లకు దిగుబడి తగ్గిందని, వచ్చిన పంటకైనా ధర లేకపోవడంతో కర్నూలు మార్కెట్‌యార్డులో వ్యాపారులు ధర తగ్గించి దగా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. పంట తమ చేతికి రాగానే ధరలు పడిపోవడానికి కారణాలేమిటో అధికారులను అడిగితే వాళ్ల సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో క్వింటం వేరుశనగ కాయలకు వారంలో గరిష్ఠ ధర రూ.7వేలకు మించడం లేదని, ఈ సంవత్సరం ప్రారంభంలో క్వింటానికి గరిష్ఠ ధర రూ.8,400 దాకా పలికితే.. ఆ తర్వాత పడిపోయిందని రైతులు అంటున్నారు. వేరుశనగ కాయలతో పాటు కర్నూలు మార్కెట్ యార్డులో మొక్కజొన్నలకు కూడా రైతులు ఆశించిన ధర లభించడం లేదు. గరిష్ఠ ధర క్వింటంపై రూ.2,051, మధ్యస్థ ధర రూ.1,851, కనిష్ఠ ధర రూ.1,851 మాత్రమే దక్కుతుందని రైతులు తెలిపారు. కందులు, ఎండుమిరప సరుకులకు కూడా గత వారం రోజుల కింద లభించిన ధర కంటే తగ్గిపోతోంది. కందులకు వారం క్రితం రూ.10వేలకుపైగానే ధర పలికితే.. గురువారం మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర రూ.9,949లు, మధ్యస్థ ధర రూ.9,869 మాత్రమే దక్కింది. కనిష్ఠ ధర రూ.1,009కు దారుణంగా పడిపోయింది. ఎండుమిర్చి ధర వారం కింద రూ. 20వేలకు పైగా గరిష్ఠ ధర లభిస్తే.. గురువారం రూ.18,777కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.11,299 మాత్రమే దక్కింది. వాము ధర మాత్రం కొంత మెరుగ్గా ఉంది. గరిష్ఠ ధర క్వింటానికి రూ.25,555, మధ్యస్థ ధర రూ.18,899, కనిష్ఠ ధర రూ.1000 పలికింది.

టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

గౌరు చరితారెడ్డి, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరు చరితతో పాటు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇచ్చారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టిన నాటి నుంచి వైసీపీ ప్రభుత్వం ఎన్నో అవాంతరాలను సృష్టించినప్పటికీ ముందుకే సాగిందని అన్నారు. దీంతో వైసీపీలో ఓటమి భయం మొదలైందని, అందు కోసమే ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. లోకేశ్ చేపడుతున్న శంఖారావం బహిరంగ సభకు జనం నీరాజనం పలుకుతుండటంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. సంపదను సృష్టించి ప్రజలకు అందజేయాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ 2024లో చంద్రబాబును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని పథకాలన్నీ అమలు చేస్తామని అన్నారు. ఈ


ప్రజలకు వివరిస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఉప సర్పంచ్ షమీనా, కాపు సంఘం నాయకులు కేవీ మధు, నాయకులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి సుధాకర్, మల్లెల ప్రశాంత్, గోపాల్, శేఖరప్ప, గడికారి శేఖర్, పొట్టి తిరుపతయ్య, నాగరాజు, వడ్డె నారాయణ, కాటినేని నారాయణ, రామగోవిందు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల చట్టాలపై వర్క్‌షాప్



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 15: లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలకు గురవుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులపై నమోదైన కేసులను 160 రోజుల లోపల పరిష్కరిస్తాయని తెలిపారు. బాలికలను చదివిద్దాం.. రక్షిద్దామని ఆయన ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, కర్నూలు డీఈవో సామ్యూల్‌తో పాటు పలువురు పారా లీగల్ వలంటీర్లు, ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 74 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు గురువారం 74 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 3,544 మందికి గాను, 3470 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన సెషన్స్‌లో 1660 మందికి గాను 1631 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 1884 మందికి గాను 1839 మంది హాజరయ్యారుని ఆర్ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు ఆయన వివరించారు.

పది ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: డీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15: త్వరలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామూయేలు పేర్కొన్నారు. గురువారం స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో మండల విద్యాధికారులతో డీఈవో సామూయేల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలను తరచుగా పర్యటిస్తూ పది పరీక్షల విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణులయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా వెనుకబడి ఉందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఈవోలు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు శ్యాముల్‌పాల్, శ్రీనివాసులు, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు


సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న బాలుడి తల్లిదండ్రులు

ఆలూరు ఫిబ్రవరి 15: అల్లరి చేశాడని బండలు తుడిచే కర్రతో కొట్టడంతో 5వ తరగతి విద్యార్థి జస్వంత్‌కు గాయాలయ్యాయి. బుధవారం రాత్రి చెయ్యి నొప్పితో బాధపడుతున్న విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు ఏమైందని అడగగా ప్రిన్సిపాల్ కొట్టిందని చెప్పాడు. దీంతో ఆలూరు పట్టణంలోని సాయి శ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్దకు చేరుకొని ప్రిన్సిపాల్ అర్చనను తల్లిదండ్రులు లేపాక్షి, భాస్కర్‌లు దండించారు. అయితే 'మీ అబ్బాయి ఇంట్లో పడి తమపై నిందలు మోపుతారా' అంటూ ప్రిన్సిపాల్ దబాయిస్తోందని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. చదువు చెప్పమంటే ఇలా కొట్టడం సరికాదని వెంటనే ప్రిన్సిపాల్ అర్చనపై కేసు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు షైనా, గోవర్ధన్ డిమాండ్ చేశారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 15: పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి రోషన్(37) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న రోషన్ వంట మాస్టరుగా పని చేస్తున్నాడు. సాయంత్రం గోనెగండ్ల బైపాస్ రోడ్డు సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంపైకి ఎక్కిన రోషన్‌కు అక్కడున్న విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైనారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల స్పందన రద్దు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: పరిపాలన కారణాలతో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించాల్సిన ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



అశ్వ వాహనంపై స్వామి, అమ్మవారు, పూజలు చేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 15: నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవం గా కొనసాగుతున్నాయి. ఆరో రోజు గురువారం సాయంత్రం స్వామివారు, అమ్మవార్లు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీవారి మూల మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేశారు. అనంతరం లక్ష్మీ కుబేర, సుదర్శన హోమాలు నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కళ్లే చంద్రశేఖర్‌శర్మ, హెచ్‌కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్ రావు, సభ్యులు కేజీ ప్రభాకర్, శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి పూజలకు హాజరైన టీజీ వెంకటేశ్: సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన అశ్వవాహన సేవలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ పాల్గొన్ని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 15: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. గురువారం ఉండవల్లిలోని నివాసంలోని చంద్రబాబు సమక్షంలో కర్నూలు, కదిరి, రాయదుర్గం, కోవ్వూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు చేరారు. ఉమ్మడి జిల్లాలోని కర్నూలు నియోజకవర్గానికి చెందిన మైనార్టీ సీనియర్ నాయ కులు మహమ్మద్ ఖానీ, వాసవీ పైపుల కంపెనీ అధినేత సత్రశాల జగన్నాథ్ గుప్తాలు చేరారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన కాటన్ బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డిలకు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

23 నుంచి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 15: ఈనెల 23, 24 తేదీల్లో నంద్యాల పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో 52వ రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ ప్రెసిడెంట్ నిమ్మకాయల సుధాకర్, సెక్రటరీ మహబూ బ్‌బాషాలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. 15 జిల్లాల నుంచి 200 మంది మహిళా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని, పోటీలు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మార్చి 16 నుంచి 20వ తేదీ వరకు కేంద్ర పాలిత ప్రాంతమైన దాదానగర్ హవేలీలో జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వారు తెలిపారు.

18న జిల్లా స్థాయి సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 15: జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్స్ బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయోపరిమితి సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, పాస్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. సబ్ జూనియర్ క్రీడాకారులు 1.1.2009, జూనియర్ క్రీడాకారులు 1.1.2004 సంవత్సరములో జన్మించినవారై ఉండాలన్నారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 25వ తేదీ వరకు ముత్తుకూరు మండలం నెల్లూరు జిల్లాలో జరగనున్న సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరా లకు 9440257242 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం
- భరోసా యాత్రను ప్రారంభించిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 15: పదేళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న కర్నూలు ప్రజలకు అండగా ఉండేందుకు భరోసా యాత్రను ప్రారంభిస్తున్నట్లు కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. గరువారం సాయంత్రం నగరంలోని పెద్దమార్కెట్‌లోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ నగర వీధుల్లో సైకిల్ తొక్కారు. అనంతరం సంస్కృత పాఠశాల వద్ద టీజీ వెంకటేష్ ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కర్నూల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అందుకే ప్రజలకు తాను అండగా ఉంటానని చెబుతూ సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యం అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే నియోజకవర్గ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కర్నూలు ప్రజల కోసం టీజీవీ సంస్థల ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు శుద్ధమైన నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో టీజీ వెంకటేష్ ఉచిత మినల్ వాటర్ ప్లాంట్లు చేశామన్నారు. అయితే ఈ ఐదేళ్లలో ఆ వాటర్ ప్లాంట్లకు ప్రభుత్వం నుంచి సహకారం అందలేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి వాటిపై వైసీపీ నాయకులు సమస్యలు సృష్టించాలని చూడటం దారుణమన్నారు.



భరోసా యాత్రను ప్రారంభిస్తున్న టీజీ భరత్

● **భరోసా యాత్ర సాగింది ఇలా..** సంస్కృతం పాఠశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ చేరుకుని అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి విక్టరీ టాకీస్, గడియారం ఆసుపత్రి, చిన్న అమ్మవారిశాల, మాసుంబాషా దర్గా, లాల్ మసీదు, దర్వేష్ ఖాద్రీ దర్గా, బాపూజీ నగర్, రామాలయం, కిడ్స్ వరల్డ్, రాజవిహార్ సెంటర్ నుంచి మౌర్యఇన్ చేరుకుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 15: పారిశ్రామిక, రైతు గ్రామీణ, రవాణా, కార్మిక కర్షక ప్రజాసంఘాల అధ్వర్యంలో నేడు జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో రైతు, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాలు పాల్గొన్నాయి. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధా నాలను వ్యతిరేకిస్తూ పారిశ్రామిక, రైతు గ్రామీణ బంద్, రవాణా రంగ కార్మికుల టైర్ బంద్ పేరుతో అన్ని కార్మిక, కర్షక, ప్రజాసంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.మునెప్ప, అంజిబాబు, శ్రీనివాసరవు, చంద్రశేఖర్, భాస్కర్, సాయిబాబా పాల్గొన్నారు.

● రవాణా సమ్మెలో డ్రైవర్లంతా పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కొత్తబస్టాండు ఆవరణలో ప్రైవేట్ బస్సు డ్రైవర్లతో సంతకాల సేకరణ



మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ డ్రైవర్లను కఠినంగా శిక్షించి జైలుకు పంపే బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లను తీవ్రంగా శిక్షించే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) 2023కు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రమేష్, రంగస్వామి పాల్గొన్నారు.

'అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి'



హైవే అథారిటీ సీజీఎంకు వినతి పత్రం ఇస్తున్న గౌరు చరిత

ఓర్వకల్లు/కల్లూరు, ఫిబ్రవరి 15: హుశేనాపురం బస్టాండ్‌పై అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. గురువారం నన్నూరు గ్రామ సమీపాన గల టోల్‌ప్లాజా వద్ద ఢిల్లీ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సీజీఎం కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ మండలంలోని హుశేనాపురం, నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లె, బలపనూరు గ్రామాల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి, బస్టాండ్లను ఏర్పాటు చేయాలని కోరారు. నన్నూరు ఎయిర్‌పోర్టు వద్ద సర్వీసు రోడ్డు వేయాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి, యశ్వంత్ రెడ్డి పాల్గొ న్నారు.

కూలీల సంఖ్య పెంచాలి: ఎంపీడీవో



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

సి.బెళగల్, ఫిబ్రవరి 15: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శకుంతల సిబ్బందికి ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాల యం సమావేశ భవనంలో ఏపీవో లక్ష్మన్న ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శకుంతల మాట్లా డుతూ ఉపాధి పనులకు వచ్చిన వారికి మాత్రమే హాజరు వేయాలన్నారు. పనికి రాకుండా ఇంటి దగ్గర ఉన్న వారికి హాజరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జాబుకార్డులో పేరు ఉన్నవారు మాత్రమే ఉపాధి పనులకు హాజరు కావాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉష్ణోగ్రత పెరిగే లోపు పనులు ముగించుకోవాలన్నారు. ఈసమావేశంలో ఈవోఆర్డీ సందీప్, ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజు ఉన్నారు.

కులగణనను వేగవంతం చేయాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 15: కులగణనను వేగవంతం చేయాలని తహసీల్దార్ అనుపమ సచివాలయ సిబ్బంది ఆదేశించారు. గురువారం మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల గ్రామాలలో కులగణనను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లా డుతూ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కులగణన పూర్తి సమాచారం సేకరించాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్లను విచారణ చేసి తహసీల్దార్ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. తహసీల్దార్ వెంట పోలింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 15: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న వలంటీర్లకు ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో గురువారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి నగర మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, కమిషనర్ భార్గవతేజ, జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి హాజరయ్యారు. వార్డులలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లుకు నగదు పురస్కారంతోపాటు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

● ఓర్వకల్లు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నగర మేయర్ బీవై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్వాగతం పలికారు. నియోజకవర్గ సమస్యలపై హాఫీజ్‌ఖాన్ ముఖ్యమంత్రికి వివరించారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న జగన్‌రెడ్డి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 15: సీఎం జగన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బెస్త రామాంజనేయులు అన్నారు. గురువారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కర్నూలులో వివాహ వేడుకకు హాజరవుతున్న నేపథ్యంలో కర్నూలు జిల్లా టీఎన్ఎస్ఎఫ్ నాయకులకు ముందస్తు నోటీ సులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్‌రెడ్డి కర్నూ లుకు వస్తే టీడీపీ అనుబంధ విభాగమైన టీఎన్ఎస్ఎఫ్ నాయకులకు భయపడి నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగానే ప్రభుత్వం నడుస్తుందా లేక రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చూస్తుంటే ఎమర్జెన్సీ తలపిస్తున్నాయని,



మాట్లాడుతున్న రామాంజనేయులు

అధికారులు వైసీపీ నాయకుల చుట్టూ తిరుగుతూ భజన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బోయ తేజ, బెస్త జయసూర్య, బల్లేకల్లు సూర్య, గణేష్, నూర్, శశి, మహబూబ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 15: ఉద్యోగు సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులు వారి పిల్లల చదువులు, పెళ్లిల కోసం రుణానికి దరఖాస్తు పెట్టుకుంటే.. ఆ డబ్బును ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీతాలు, పెన్షన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ మండల కార్యదర్శి నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిపో ఎదుట ఎన్ఎంయూ నిరసన



నిరసన తెలుపతున్న ఎన్‌యంయూ నాయకులు

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 15: ఏపీఎస్ ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు 1, 2 డిపోల ఎదుట ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమానికి ఎన్‌యంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.మద్దిలేటి, శేఖర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ పాల్గొని ప్రసంగించారు. పీఆర్‌సీ వెంటనే ఇవ్వాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి అర్హులైన వారం దరికీ పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులు ఈనెల 21న కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిసున్నట్లు ఆయన వివ రించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ఆర్ నాయుడు, పీపీ వలి, ఉరు కుంద, ఫక్రుద్దీన్, రంగన్న, డిపో, గ్యారేజీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 15: స్వయం సహాయక సంఘం సభ్యుల సమస్యలు పరిష్కరించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, స్వయం సహాయక గ్రూపుల సంక్షేమ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ పద్మ కోరారు. గురువారం మెప్మా పీడీ నాగ శివలీలకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ అమలు చేస్తామని చెప్పి దీనిని రూ.3 లక్షలకు మాత్రమే పరిమితం చేశారని, తీసుకున్న రుణం మొత్తానికి సున్నా వడ్డీ వర్తింపజేయాలని కోరారు. అభయహస్తం పేరుతో చాలా మంది సభ్యులు డబ్బులు కట్టారని, వారికి ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. శ్రీనిధి పేరుతో రూ.లక్షలు డిపాజిట్లు కింద సమృద్ధి పొదుపులు కట్టించుకున్నారని, కానీ 2018 సంవత్సరం నుంచి ఇప్పటికి శ్రీనిధి లోన్‌లలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. సమృద్ధి పేరుతో కట్టించుకున్న డిపాజిట్లను తిరిగి ఇప్పించాలని, అకౌంట్లు ఓపెన్‌గా ప్రకటించాలని, శ్రీనిధి లోన్లు మంజూరు చేయాలని కోరారు. జగనన్న మార్ట్‌లకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన లోన్లు మంజూరు చేయాలని, కార్పొరేట్ కంపెనీల దగ్గర కొనుగోలు చేయాలన్న కండిషన్లను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేవతి, నజియా సేకూన్; కుమారి, క్రిష్ణవేణి, పర్వీన్, రాధా, కవిత పాల్గొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత తిరుణాల



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 15: మండలంలోని అనుగొండలో అవధూత రామిరెడ్డి తాత తిరుణాల ఉత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలో వేకువజామున మేలుకొలుపు, సుప్రభాతం, పంచామృతాభిషేకం, పుష్పార్చన తదితర పూజలు నిర్వహిం చారు. అనంతరం భక్తులు రామిరెడ్డి తాత నామావళి పఠించారు. మధ్యా హ్నం రామిరెడ్డితాత చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి మేళతాళాలు మధ్య నందికోలలు ఆడిస్తూ వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట్ల వెంట టీచర్ రామక్రిష్ణారెడ్డి, పద్మనాభరెడ్డి, బంకు గిడ్డయ్య, లింగేశ్వరయ్య ఉన్నారు.

● **నేడు ఎద్దుల బండలాగు పోటీ:** రామిరెడ్డి తాత తిరుణాలను పురస్కరించుకుని శుక్రవారం ఎద్దుల బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మొదటి ఎనిమిది జతల ఎద్దుల యజమానులకు దాతల సాయంతో నగదు పురస్కారం అందించనున్నట్లు తెలిపారు.

డ్రైవర్స్ కాలనీలో తాగునీటి సమస్య



వాటర్‌ట్యాంక్ వద్ద నీటి కోసం మహిళల అవస్థలు

కల్లూరు, ఫిబ్రవరి 15: కల్లూరు అర్బన్ 36వ వార్డు డ్రైవర్స్ కాలనీలో పదిరోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు కార్పొరేషన్‌లో వీలినమైన 36వ వార్డు పెద్దపాడు కాలనీల ప్రజలకు అందించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వార్డులోనే తీవ్ర తాగునీటి సమస్య వేధిస్తున్నా పట్టించుకోవడంలేదని మహిళలు విమ ర్శిస్తున్నారు. కాలనీలో పది రోజులకు పైగా తాగునీరు లేక ప్రజలు డబ్బులు వెచ్చించి కొనుక్కుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఎం న్యూసిటీ కమిటీ నాయకుడు టి.రాముడు మాట్లాడుతూ కల్లూరు శివారు కాలనీలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధం

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 15: మండలంలోని అనుగొండలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వివరాలివి.. గ్రామానికి చెందిన పెద్దమునిస్వామికి చెందిన గడ్డివాముల నుంచి పొగలు వస్తుండడం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో కోడుమూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పశుగ్రాసం పూర్తిగా దగ్ధం కావడంతో బాధిత రైతుకు సుమారు రూ. 70వేలు నష్టం వాటిల్లింది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

న్యాయ రాజధానిని ప్రశ్నించినందుకు అరెస్టులా?

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 15: రాయలసీమకు న్యాయరాజధాని ఎక్క డని ప్రశ్నించినందుకు అరెస్టు చేశారని రాయలసీమ విద్యార్థి సమైక్య వ్యవ స్థాపక అధ్యక్షుడు, సీమ ఉద్యమకారుడు కృష్ణ ప్రశ్నించారు. గురువారం కర్నూలు నగరంలోని సీఎం జగన్ వివాహానికి హజరవుతున్న నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసి త్రీటౌన్‌కు తరలించడాన్ని అయన ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు న్యాయరాజధాని తోపాటు శ్రీబాగ్ ఒప్పందంలో భాగంగా సీమకు రావాల్సిన హక్కులను సీఎం జగన్మోహన్‌రెడ్డి కాలరాశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో న్యాయ రాజధాని బిల్లులను వెనక్కి తీసుకుని ఇంత వరకు మళ్లి బిల్లు పెట్టలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో 25 వేల టీచర్ల డీఎస్సీ ఉద్యోగ ప్రకటన ఇవ్వకుండా కేవలం 6,100 పోస్టులు మాత్రమే విడుదల చేశారన్నారు. 2022లో 325 జీవో తీసుకొచ్చి పెండింగ్ ప్రాజెక్టులు కట్టకూడదని తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాలలో జగన్ మోసం చేశారని మండి పడ్డారు.

జీవ సాంకేతిక శాస్త్రంపై అవగాహన అవసరం

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 15: జీవ సాంకేతిక శాస్త్రంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఇండస్ట్రీ కనెక్ట్ అనే అంశంపై జీడీసీ, కేవీఆర్ డిగ్రీ కళాశాల జీవ సాంకేతిక శాస్త్ర విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ సాంకేతిక విభాగం వల్లే ప్రతి అంశం వెలుగులోకి వస్తాయన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆల్ గెన్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థకు చెందిన డైరెక్టర్ పీవీ చేరిష్, రిజిస్ట్రార్ డి.శ్రీనివాసులు, క్లస్టర్ వర్సిటీలో పరిధిలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ వీవీఎస్ కుమార్, జీ.హేమంత్, అధ్యా పకులు ఇంద్రవతి, డి.స్వప్న కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

సచివాలయాల పరిశీలన

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 15: కర్నూలు రూరల్ మండలం ఈ.తాండ్ర పాడు గ్రామంలోని నూతన సచివాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ పరిశీలకుడు (పీఆర్ అండ్ ఆర్డీ) పోతురెడ్డి నాగార్జునరెడ్డి గురువారం పరిశీలించారు. తాండ్రపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి అడ్డాకుల గోవిందు, సచివాలయ సిబ్బంది కలిసి ఆయనకు పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జగనన్న కాలనీ, ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను కూడా ఆయన పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గార్గేయపురం గ్రామానికి వెళ్లి అక్కడ జగనన్న కాలనీ, సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల సూపరింటెండెంట్ ఎస్.భాస్కర్‌నాయుడు ఉన్నారు.

'అర్హులకు కేంద్ర ప్రభుత్వ పథకాలందించాలి'

కల్లూరు, ఫిబ్రవరి 15: అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు సి.వీరప్ప అన్నారు. గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 41వ వార్డులో చేపట్టిన వికసిత భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అర్హులందరికీ పథకాలను అందించాలన్న సంకల్పంతో ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 15: దేశ వ్యాప్తంగా ఈ నెల 16న చేపట్టే కార్మికుల గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.నాగన్న, మండల సహాయ కార్యదర్శి మధుసూదన్‌లు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు, లొద్దిపల్లె, వివిధ గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను అవలంబిస్తూ కార్మికులు, కర్షకులు, ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతుందన్నారు.

అయినవారికే నీరు.. కాని వారికి కన్నీరు

● టీడీపీ సానుభూతిపరులని కనెక్షన్ కట్

● పైపు లైన్ కోసం గుంత తవ్వారు.. వదిలేశారు

● ఇదీ పైడిచింతలపురం తండాలో అధికారులు తీరు

తుగ్గలి, ఫిబ్రవరి 15: జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి పేదవాని ఇంటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా పథకాన్ని ప్రవేశ పెట్టారు. అయితే, ఇక్కడ మాత్రం కేవలం అధికార పార్టీ సానుభూతిపరులకు మాత్రమే కొళాయి కనెక్షన్లు ఇస్తూ మిగతా వారిని విస్మరిస్తున్నారు. ఇక్కడ అధికార పార్టీని ఇష్టపడని వారు దాహంతో తల్లడిల్లాల్సిందే. ఇతరులు దరఖాస్తు చేసినా ఇళ్ల ముందు పైపులైన్ కోసం గుంతలు తవ్వి అలాగే వదిలేస్తున్నారు.


పైచింతలకొండలో పైపులైన్ కోసం తవ్విన గుంత

వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని శభాష్‌పురం మజరా గ్రామం పైచింతలకొండ. ఇక్కడ దాదాపు 150 గృహాలు ఉన్నాయి. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ కింద తాగునీటి సదుపాయం కల్పించారు. అయితే, టీడీపీ సానుభూతిపరుల 30 ఇళ్లకు మాత్రం పైపులైన్ కోసం గుంతలు తవ్వి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. నెలల తరబడి ఎదురు చూస్తున్నా పైపులైన్ వేయడం లేదు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రతి వారం బాధితులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. కొళాయి కోసం గుంతలు తవ్విన ప్రదేశాల్లో పడి చాలా మందికి గాయాలయ్యాయని, పశువులు, మూగ జీవాలను కళ్లాల్లోనే కట్టుకోవాల్సి దుస్థితి నెలకొందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సానుభూతిపరులనే కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమపై వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతును వివరణ కోరగా.. పైపులు తక్కువ రావడంతో పనులు ఆపేశామని, పైపులు కొనుగోలు చేసి త్వరలోనే కొళాయిలు వేస్తామని పేర్కొన్నారు.

మేమేం పాపం చేశాం

మా కళ్ల ముందరే ప్రతి ఇంటికి కొళాయి వేశారు. నీళ్లు కూడా వస్తున్నాయి. మాకు మాత్రమే ఎందుకు వేయలేదు. మేమేం పాపం చేశాం. మాక్కూడా కొళాయి కనెక్షన్లు ఇచ్చి మంచినీరు అందించాలి.

- కాశన్న, పైచింతల కొండ గ్రామస్థుడు

స్పందన లేదు

పనులు వదులుకొని దాదాపు 40 కి.మీలు పత్తికొండకు వెళ్లి అధికారులను ప్రాధేయ పడుతున్నాం. ఎలాంటి స్పందన లేదు. నాయకుల మాటలు విని మా ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇలా పక్షపాతం చూపించడం అన్యాయం.

- నాగరాజు, గ్రామస్థుడు

రోళ్లపాడులో నీటి కోసం తహతహ

తుగ్గలి, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని రోళ్లపాడు తండాలో తాగునీటి బోర్లు ఇంకి పోవడంతో చుక్క దొరక్క గ్రామస్థులు తహతహలాడుతున్నారు. తమ దాహం తీర్చే వారే లేరా అంటూ గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోళ్లపాడు తండాలో 500 మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. గిరిజనుల దాహార్తి తీర్చేందు కోసం బోర్లతో పాటు తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లు ఇంకిపోవడంతో ఉన్న కొళాయిలకు కూడా నీరు సక్రమంగా అందక తల్లడిల్లుతున్నారు. ఇక్కడ నీరు తాగాలంటే పనులు మానుకోవాలి. బిందె నీటి కోసం గంటల తరబడి వేచి ఉండాలి. అధికారులు తండాకు ఒక్కసారి కూడా రాలేదు. మా గోడు ఎవరికి వినిపించాలో తెలియడం లేదు.' అంటూ గిరిజన మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు స్పందించి గిరిజన తండావాసుల దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


తాగునీటి కోసం కొళాయి వద్ద ఎదురు చూస్తున్న మహిళలు

వైసీపీ మైనార్టీ, ఆటో యూనియన్ నాయకుల వలస

● కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

పత్తికొండ, ఫిబ్రవరి 15 : నియోజకవర్గ పరిధిలోని వెల్దుర్తి పట్టణంలో వైసీపీ మైనార్టీనాయకులు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వెల్దుర్తి మండల కోఆప్షన్‌మెంబర్, జామియా మసీద్ చైర్మన్ ముల్లాబషీర్, ముల్లాఉస్మాన్, ఖాజాముద్దీన్, ఇదురుబాషా, ఖాజాహుసేన్, ఖాజాచందారి, ఖాజాసుభాన్ మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరిట జగన్ చెప్పిన కల్లబొల్లిమాటలకు ఆకర్షితులమై గత ఎన్నికలలో వైసీపీ విజయానికి పనిచేశామని, అయితే, మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీతోనే మైనార్టీ సంక్షేమం సాధ్యమని భావించి యువ నాయకుడు కేఈ శ్యాంబాబు నాయకత్వంలో పనిచేసేందుకు టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. అలాగే వెల్దుర్తి ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు క్రిష్ణ, సురేష్, బాలరాజుయాదవ్, మధురాజు, మధుశేఖర్, పరశురాముడు, గవిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆటోవర్కర్ల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. ఫైన్ల పేరుతో వేలకువేలు వసూలుచేస్తూ తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైన్లు కట్టలేక ఆటోలను అమ్ముకొని రోడ్డుపాలు అయ్యేపరిస్థిలో ఆటో కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తిరిగి రోజులు వస్తాయన్న నమ్మకంతో కేఈ శ్యాంబాబు నాయకత్వంలో టీడీపీ గెలుపుకోసం పనిచేసేందుకు పార్టీలోకి చేరుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెల్దుర్తి మండల కన్వీనర్ బలరాంగౌడ్, ఎంపీటీసీ రామక్రిష్ణ, రమాకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఈ శ్యాంబాబు

విద్యార్థి నాయకుల అరెస్టు అన్యాయం

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 15: సీఎం జిల్లా పర్యటనకు వస్తే ముందస్తుగా విద్యార్థి యువజన, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని నోటీసులు ఇవ్వడం అన్యాయమని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు తాహెర్ వలి, నాగరాజు, శ్రీనివాస్, వీరేష్, సూర్య అన్నారు. గురువారం పోలీసులు ఇచ్చిన నోటీసులను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. రాయలసీమ ప్రాంత సమస్యలను పట్టించుకోకుండా నాలుగున్నరేళ్లుగా మోసం చేశారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరితే నోటీసులు జారీ చేసి అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. సీఎం వస్తే రోడ్డుకు ఇరువైపులా పరదాలు కప్పడం పిరికిపంద చర్య స్పష్టం చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా వినతులు ఇచ్చే స్వేచ్ఛను కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, నవీన్, తిరుమలేష్, అనిల్, రవి, తేజ, వెంకటేష్, మహేష్, బాలు, రమేష్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న యువత

విద్యార్థి సంఘం నాయకుల అరెస్టు

ఎమ్మిగనూరు రూరల్ : కర్నూలుకు సీఎం జగన్ వస్తుండడంతో గురువారం ఉదయం విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు నరసన్నతో పాటు ఆర్‌పీపీఎస్ నల్లారెడ్డిని రూరల్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

రెండో రోజూ ఉద్యోగుల నిరసన

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 15: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్‌దారులకు రాష్ట్రప్రభుత్వం ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరుతూ రెండో రోజూ ఉద్యోగులు నిరసన గళం వినిపించారు. ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజు గురువారం తుంగభద్ర ఎల్‌ఎల్‌సీ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో ఆదోని తాలుకా అధ్యక్షుడు రమేష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అధికారంలో రాకముందు ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తామని రివర్స్ పీఆర్సీ ఇచ్చి తమను మోసం చేశారన్నారు. కనీసం ఒకటో తేదీన జీతాలు తీసుకోలేని పరిస్థితిల్లో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసిన్, ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షురాలు ఉషారాణి, మల్లికార్జున రెడ్డి, బజారప్ప, శేఖప్ప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



టీబీపీ ఎల్‌ఎల్‌సీ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏపీజేఏసీ నాయకులు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పత్తికొండ : ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పత్తికొండ ఉద్యోగ జేఏసీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళ చేపట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు గురువారం భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సాయిబాబా, టీఎండీ హుసేన్, వీరేష్, వెంకటరమణ, రాంమోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్ ఉన్నారు.

పత్తికొండ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి : ఆర్జేడీ

పత్తికొండ, ఫిబ్రవరి 15 : పత్తికొండ మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి చర్యలు చేపడతామని ఆ శాఖ ఆర్జేడీ రామాంజినేయులు అన్నారు. సాధారణ తనఖీలో భాగంగా ఆయన గురువారం పత్తికొండ వ్యవసాయమార్కెట్‌ను పరిశీలించారు. టమోటా ధరలపై, సోమవారం పశువుల సంత నిర్వహణ, కూరగాయల మార్కెట్ నిర్వహణ తదితర అంశాలపై సెక్రటరీ కార్నలిస్, సిబ్బందితో మాట్లాడారు. మార్కెట్‌యార్డ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం, వేరుశనగ, పత్తి వ్యాపార కేంద్రాల ఏర్పాటు అంశాలపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన సమా ధానమిస్తూ మార్కెట్‌లో నిరుప యోగంగా ఉన్న దుకాణాలను త్వరలోనే వేలాలువేసి వ్యాపారులకు అద్దెలకు ఇస్తామని, అలాగే రిపేరుపనులకు ప్రత్యేక నిధులను కేటాయిస్తామని పేర్కొన్నారు. పత్తికొండ ప్రాంతంలో అవసరమైన స్థాయిలో వేరుశనగ, పత్తి పంటల దిగుబడులు లేకపోవడంతో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోతున్నామని ఆర్జేడీ వివరించారు.


మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు

అదుపు తప్పి గుంతలో పడిన ఎక్స్‌కవేటర్


గుంతలో పడిన ఎక్స్‌కవేటర్

మంత్రాలయం, ఫిబ్రవరి 15: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఎక్స్‌కవేటర్ రోడ్డు పై నుంచి అదుపు తప్పి గుంతలో పడింది. గురువారం కటిక రజ్జప్‌కు చెందిన ఎక్స్‌కవేటర్‌ని తీసుకొని ఆపరేటర్ పనికి వెళ్తుండగా.. గ్రామందాటిన కొంత దూరంలో రోడ్డుపక్కన అదుపు తప్పి గుంతలోకి బోల్తా పడింది. ఆపరేటర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మరో ఎక్స్‌కవేటర్‌ని రప్పించి దాన్ని బయటకు తీశారు.

రేపటి నుంచి మాజీ ఎమ్మెల్యే పల్లె నిద్ర

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 15: నందవరం మండలంలో ఈ నెల 17నుంచి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ కార్యాలయం గురువారం ఓ ప్రకటలో తెలిపింది. 17వ తేదీన గురుజాల నుంచి కార్యక్రమం ప్రారంభించి మార్చి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారని పేర్కొంది. పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులతో పాటు మండల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరింది.

రెవెన్యూ కార్యాలయంలో డిజిటల్ కీ కష్టాలు

మద్దికెర, ఫిబ్రవరి 15: మద్దికెర రెవెన్యూ కార్యాలయంలో ప్రజలకు డిజిటల్ కీ కష్టాలు తప్పడం లేదు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారు వారం రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. తహసీల్దారు విధుల్లో చేరి వారం రోజులవుతున్నా అధికారుల నుంచి డిజిటల్ కీ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం నుంచి తహసీల్దార్ రజాక్‌వలి బాధ్యతలు చేపట్టి వారం రోజులవుతున్నా ఇంత వరకు డిజిటల్ కీ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ కీ వచ్చేంత వరకు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురు చూడాల్సిందేనా అంటూ అత్యవసర ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్‌కు డిజిటల్ కీ కేటాయించి సర్టిఫికెట్లు అందేలా చూడాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 15: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప కోరారు. గురువారం ఎంఈవో కార్యాలయంలో ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన ఎంఈవో రాజేంద్రప్రసాద్‌ను కలిసి సన్మానించి, ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి బి గోపాల్, మండల అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

దేవనకొండ ,ఫిబ్రవరి 15: ఈ నెల 19 నుంచి 25 వరకు కౌలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మండలంలోని కప్పట్రాళ్ల రిజార్వు ఫారెస్టులోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 21న స్వామివారి కల్యాణోత్సవం, 24న రథోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

చెరుకులపాడులో చెక్కుల పంపిణీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 15 : మండలంలో చెరుకులపాడు గ్రామంలో గురువారం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.21 లక్షల చెక్కును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అందజేశారు. పెద్ద బోడన్న (కొసనపల్లె), భోగ్యం సువర్ణ (పేరేముల), తెల్లగళ్ల కేశవయ్య(పేరేముల) కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.7లక్షల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రవిరెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, పేరాముల సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి : సీఐటీయూ

వెల్దుర్తి, ఫిబ్రవరి 15: కేంద్రంలో కార్మిక వ్యతిరేక చట్టాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె. నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ, రైతుభరోసా కార్యాలయాల్లో సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాలను, కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రభుత్వరంగ ఆస్తుల ను కార్పొరేట్‌కు కట్టబెడుతోందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీని రానున్న ఎన్నికల్లో ఓడించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండలకార్యదర్శి రాజు, ఆశాలు చంద్రమ్మ, సులోచన, చిన్నఎల్లమ్మ, రామలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● మంత్రి జయరాంకు హమాలీల వినతి

అలూరు, ఫిబ్రవరి 15: హమాలీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీ మహేష్ కోరారు. గురువారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూర్ జయరామ్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హమాలీ ముఠా, జట్టు కళాసి వంటి పేర్లతో పిలువబడే వర్కర్స్ లక్షలాదిగా ఉన్నారని, వీరంతా ప్రజలకు ఆహార ధాన్యాలు ఎగుమతి, దిగుమతితో పాటు ట్రాన్స్‌పోర్ట్ ఐరన్, సిమెంట్ దుకాణాల్లో మార్బల్ షాపులను బస్టాండ్‌లోను రైల్వేస్టేషన్లలోనూ హమాలీలు పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హమాలీ కార్మికులకు న్యాయం చేయలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు శివ, రైతు సంఘం మండల కార్యదర్శి సీ గోపాల్, సిద్ధలింగ, రవి, రాజు పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం

మంత్రాలయం, ఫిబ్రవరి 15 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులతో కోలాహలంగా మారింది. రాఘవేంద్ర స్వామికి ఇష్టమైన గురువారం కావటంతో దక్షిణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం, పరిమళ ప్రసాద క్యూలైన్స్‌ల వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలకు, పూజ సామాగ్రికి డిమాండ్ పెరిగింది.


శ్రీ మఠంలో భక్తుల రద్దీ

ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారాలు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 15: ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లను ఆర్టీసీ జిల్లా, స్థానిక అధికారులు నగదు పురస్కారాలు అందించి అభినందించారు. గురువారం ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ అమర్నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29ఏళ్ల నుంచి ఉత్తమ సేవలు అందించిన కేపీ బాషా, డీఎస్ రాముడు, హనుమేష్‌కు మొదటి, ద్వితీయ, తృతీయ నగదు పురస్కారాలను ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు డీపీటీఓ శ్రీనివాసులు అందజేసి అభినందించారు.

షర్మిలను విమర్శిస్తే సహించేది లేదు

● డీసీసీ అధ్యక్షుడు బాబురావు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు బాబురావు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 15: పీసీసీ పగ్గాలు చేపట్టిన వైఎస్ షర్మిలపై వైసీపీ నాయకులు బీ-టీం ద్వారా విమర్శలు చేయించడం సరికాదని, విమర్శల పరంపర ఇలాగే కొనసాగితే సహించేది లేదని, వారి ఇళ్లను ముట్టడించి ఆందోళనలు చేపడతామని డీసీసీ అధ్యక్షుడు బాబురావు హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ మరో రెండు నెలలలో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వ డీఎస్సీను ప్రకటించడం బూటకమని అన్నారు. ఐదేళ్లుగా భర్తీ చేయని టీచర్ పోస్టులను, ఇప్పుడు భర్తీ చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఎన్నికల ముందు హడావిడి చేస్తోందని ఎద్దేవా చేశారు. సర్పంచులుగా ఎన్నికైన వారు తమ గ్రామ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు లేక ప్రజలకు ముఖం చాటేసుకొని తిరగాల్సిన దుస్థితికి కారణం, రాష్ట్ర ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. పశ్చిమ ప్రాంతవాసుల వలసలను నిరోధించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు లాజరస్, డీసీసీ ఉపాధ్యక్షుడు దిలీప్ ధోక, మహిళ విభాగ్ జిల్లా అధ్యక్షురాలు ప్రమీల, డీసీసీ కార్యదర్శి అబ్దుల్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మారుతి రావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, శ్రీనిధి పాల్గొన్నారు.

'భగవత్‌జీతో మహిళా సమస్యలపై మాట్లాడా'

ఆదోని టౌన్, ఫిబ్రవరి 15: మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌జీతో కర్నూలులో జరిగిన చర్చాగోష్టిలో మాట్లాడానని ఆర్‌ఎస్‌ఎస్ నారీశక్తి సమ్మేళన్ జిల్లా కన్వీనర్, ప్రముఖ న్యాయవాది, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సి. సావిత్రి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధ సంఘాలైన మహిళా సేవిక సంఘ్, ఆరోగ్య భారతి, సమర సత్తా వాదిక్, నారీశక్తి సమ్మేళన్, విశ్వహిందూ పరిషత్ విభాగాల నుంచి ఉమ్మడి జిల్లాలలో యాక్టివ్‌గా ఉన్న 12 మంది విశిష్ట మహిళలతో జరిగిన ఈ చర్చాగోష్టిలో జిల్లా నుంచి పాల్గొనడానికి తనకు అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్భయ యాక్ట్‌తో పాటు, దిశా చట్టం అమలులో జరుగుతున్న కాలయాపన గురించి, దోషులు తప్పించుకుంటున్న వైనం, బాధితులు పడుతున్న మనోవేదన గురించి తాను ఆయన దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. మహిళల భద్రత కోసం ప్రవేశపెట్టిన నిర్భయ, దిశ చట్టాల సత్వర అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజా ఉద్యమం చేపట్టడమే మార్గమని, అందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని మోహన్ భగవతిజీ హామీ ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.


ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను కలిసిన మహిళలు

జీవో ప్రతులు దహనం


జీవో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం అన్యాయమని, అందుకు నిరసనగా గురువారం స్థానిక మెయిన్ బజారులో జీవో.40ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీవో ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్‌జీ నాగరాజు, మండల ఆర్థిక కార్యదర్శి విశ్వనాథ్, టీఎన్‌టీయూసీ నాయకులు ఎన్.చంద్రమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించకపోగా.. కొత్త సమస్యలను కావాలని తెస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులను మోసం చేసే విధంగా డీఎస్సీని ప్రకటించి పైగా అప్రెంటిస్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, ఇది నిరుద్యోగులను మోసం చేసే దగా డీఎస్సీ అని మండిపడ్డారు. విద్యార్థి సంఘం నాయకులు శ్రీకాంత్, గొడుగు సతీష్‌కుమార్, శేషాద్రి, హరినారాయణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

కోసిగి, ఫిబ్రవరి 15: ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వస్తున్న ఆటో డి.బెళగల్ రోడ్డులో బోల్తా పడిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కురువ పార్వతి (65) మృతి చెందింది. వివరాల్లోకి వెళితే కురువ పార్వతి కోడలు స్వగ్రామమైన మురువణికి వెళ్లి తిరిగి ఆటోలో వస్తుండగా.. గురువారం రాత్రి డి.బెళగల్ సమీపంలో ఆటో బోల్తా పడి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు పార్వతికి భర్త కురువ శరణయ్య, ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు మరికొంత మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన రెండు గంటల వరకు కూడా పోలీసులు రాకపోవడంతో మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండానే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతిరాలి బంధువులు ఆరోపించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోసిగి, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని తుమ్మిగనూరు గ్రామ సమీపంలో అక్రమంగా కర్ణాటక నుంచి కోసిగి మండలంలోకి తరలిస్తున్న సుమారు 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పులికనుమ పంప్‌హౌస్ సమీపంలో సెబ్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం రాత్రి దాడులు చేసి పట్టుకున్నారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు రెండు బైకులలో అక్రమ కర్ణాటక మద్యాన్ని అక్కడే వదిలి పారిపోవడంతో బైకులతో పాటు 10 బాక్సులలో మొత్తం 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు కలిగిన 960 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తూ..

ఆదోని: ఆదోని రైల్వే స్టేషన్లో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదోని రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి మద్యంను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్సై గోపాల్ తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ దిగి రైల్వే ప్లాట్ ఫామ్-1 ఇందిరా నగర్‌కు చెందిన బోయ కుమార్, బోయ శంకర్ బ్యాగులో కర్ణాటక మద్యాన్ని తెచ్చారన్నారు. తనిఖీ చేయగా రెండు లగేజ్ బ్యాగులో 384 మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించామని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. రైల్వే సిబ్బంది సాయి, హుస్సేన్, లికాయత్ అలీ గాదిలింగ ఉన్నారన్నారు.

బైక్ సీజ్.. ఒకరి అరెస్టు

మంత్రాలయం : మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటకలోని గిలకసూగూరు క్యాంప్ చెందిన ఈడిగ నాగరాజుగౌడు కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్‌ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. గురువారం కర్ణాటక నుంచి ఎమ్మిగనూరుకు 90 ఎంఎల్ గల 80 టెట్రా మద్యం ప్యాకెట్లు, 180 ఎంఎల్ గల టెట్రా ప్యాకెట్లు మొత్తం 118 మద్యం టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసి నాగరాజు గౌడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.